
ప్రజాశక్తి
గురువారం 27 ఫిబ్రవరి 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు




విద్యార్థుల ఆందోళనకు మద్దతు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక కనుపూర్తిపాడు వద్దనున్న ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు చేసిన ఆందోళనకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కమిటీ పూర్తి మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ విద్యార్థులు హక్కుల కోసం ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు హాస్టల్ వసతులు సరిగా అందకపోవడం, సరైన భోజనం అందకపోవడం ఫీజు మొత్తం చెల్లించిన తర్వాత కూడా హాల్ టికెట్లు అందించకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొన్నారన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు కళాశాల యాజమాన్యంపై తిరగ బడ్డారన్నారు. విద్యార్థుల అవసరాలు హక్కులను పరిగణనలోకి తీసుకోకుండా కళాశాల యాజమాన్యం వ్యవహరించడం సరికాదన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో కళాశాల యాజమాన్యం విఫలమైందన్నారు. ఈ సమస్యలకు తక్షణం పరిష్కారం చూపాలని ఎస్‌ఎఫ్‌ఐ నెల్లూరు జిల్లా కమిటీగా డిమాండ్ చేస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి జీవన్ ప్రకాష్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజా నాయకుడు...ఓడినా..గెలిచినా... జనంతో ఉండేవారు.. ఇది ఒకప్పటి మాట... ఎన్నికలు.. నోట్లు...ఓట్లు...సీట్లు...ఇప్పటి రాజకీయ నేతల ప్రవర్తన.2019 ఎన్నికల్లో పదికి పది స్థానాలు గెలిచి మంత్రులు, ఎం ఎల్ఏలుగా ఐదేళ్లు కనిపించిన నేతలు, ఓడిపోయిన తర్వాత పత్తా లేకుండా పోతున్నారు.ఒకరో ఇద్దరు నాయకులు మాత్రం తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావన చేస్తూ, తమ పార్టీ నాయకులకు ధైర్యం చెబు తున్నారు. రైతులకు మద్దతు ధర లేదు...ఉదయగిరిలో జామాయల్ మాయ మైపోంది...ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదు.. విద్యుత్ చార్జీలు పెరిగాయి. ఇసుక, గ్రావెల్, మట్టి, ఒక్కటేమిటి వైసిపి ప్రభుత్వంలో జరిగినవన్నా ఇప్పుడు సాగుతున్నాయి. జనం సమస్యలపై నోరు మెదపని వైసిపి నాయకులు తీరుపై ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారపార్టీ నేతలంటే కొందరు హడలిపోతున్నారు

వైసిపి నేతల మొద్దు నిద్ర..!

-జనం సమస్యలు పట్టని నాయకులు
-అధికార పార్టీ అంటే హడల్
-ఎన్నికలుంటేనే ప్రజలు గుర్తుకొచ్చేది..

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ప్రజల పట్ల అధికారపార్టీతో పాటు ప్రతిపక్షానికి బాధ్యత ఉండాలి. రాష్ట్రంలో వైసిపికి బలమైన జిల్లాల్లో నెల్లూరు రెండోది. ఇది 2019 ఎన్నికల్లో రుజువైంది. పదికి పది స్థానాలు ఆపార్టీ గెలుచుకుంది. తరువాత జరిగిన పార్లమెంట్, పంచాయతీ, మున్సిపాలిటీ ఒక్కటేమి అన్ని స్థానాలకు ఆపార్టీకి అప్పగించారు. అప్పట్లో వైసిపి మంత్రులు, ఎంఎల్ఎలు చక్రం తిప్పారు. నాయకులు అదే స్థాయిలో అధికార దర్పం ప్రదర్శించారు. 2024 ఎన్నికల్లో ఆపార్టీ ఘోర ఓటమి చవిచూసింది. అయినప్పటికీ జిల్లా వ్యాపితంగా లక్షలాది మంది ప్రజలు ఆపార్టీకి మద్దతుగా నిలిచారు. గతంలో గెలిచినా, ఓడినా జనం కోసం ఆ నియోజవర్గాల్లో నాయకులు పనిచేసేవారు. జనం కోసం కాకపోయినా ఆపార్టీ నాయకులు, కార్యకర్తలను కాపాడుకోడానికి కృషిచేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఓడిపోయిన తర్వాత నియోకవర్గానికి సంబంధం లేనట్లు కొందరు కనిపించడం లేదు. తమ ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలో ఆపార్టీ నేతలకు, ప్రజలకు తెలియడం లేదు. ఎన్నికల సమయంలో రావడం, డబ్బులు ఖర్చుపెడితే సరిపోతోంది అనే భావనతో ఉన్నట్లు తెలుస్తోంది.

సర్వేపల్లి ఎంఎల్ఎ కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన నియోజవర్గ సమస్యలపై నిత్యం ఏదో ఒక కార్యక్రమం, మీడియాతో మాట్లాడటం చేస్తున్నారు. కోవూరు ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అప్పుడప్పుడు నియోజకవర్గంలో అధికారపార్టీ అవినీతిపై ప్రశ్నించడం , కార్యక్రమాలు చేస్తున్నారు., నెల్లూరు నగరంలో ఎంఎల్‌సి పి. చంద్రశేఖర్‌రెడ్డి జనం, ఉపాధ్యాయ సమస్యలపై గట్టిగానే మాట్లాడుతున్నారు. ఇటీవల రాష్ట్ర పార్టీ అదేశాలతో విద్యుత్ ఛార్జీలపై జిల్లా స్థాయిలో ఆందోళనలు నిర్వహించారు. తూతూ మంత్రంగా నియోజకవర్గం నుంచి వచ్చి కనిపించి వెళ్ళిపోవడంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గానికి కార్యక్రమాలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ సమయంలో సర్వేపల్లి, కోవూరు, నెల్లూరు నగరం విద్యుత్ ఛార్జీలపై ఆందోళన నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనం సమస్యలు పట్టవా..!

ప్రతిపక్షాలు ప్రజల తరుపున గళం వినిపించాలి. ఉదయగిరిలో టిడిపి నేతలు జామాయల్ చెట్లు దోచుకుపోతున్నారని, అగ్రిగోల్డ్ భాధితులు, వామపక్ష నాయకులు ఆందోళన చేస్తున్నారు. కొందరిపై దాడి చేశారు. ఇక్కడ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు కనీసం ఒక్క ప్రకటన ఇచ్చిన పరిస్థితి లేదు. వెలిగొండ ప్రాజెక్టు కోసం ఆందోళనలు జరుగుతున్నాయి. తమ పార్టీ విధానం చెప్పరు. ఆత్మకూరు నియోజకవర్గంలో మేకపాటి విక్రమ్‌రెడ్డి దాదాపు కనిపించడం లేదు. స్థానికంగా ఉన్న సమస్యలపై మాట్లాడడం, కనీసం ఒక మీడియా సమావేశం ఏర్పాటు చేయడం లేదు. ఎన్నికల్లో చూసుకుందా అన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కావలి నియోజవర్గంలో రామ్‌రెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని స్థానిక ప్రజలు మర్చిపోతున్నారు. పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ఏదైనా సమస్యలుంటే కనీసం చెప్పుకోడానికి వైసిపి నేతలు ఒక్కరు కనిపించడం లేదని తెలుస్తోంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి పరిస్థితి అలానే కనిపిస్తుంది. అప్పుడప్పుడు వచ్చిన వివాహాది శుభాకార్యక్రమాలకు హజరై వెళ్తున్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన పి. అనిల్‌కుమార్ అప్పుడప్పుడు కనిపిస్తున్నాయి. ఆపార్టీ నేతలకు అందుబాటులో ఉండడం లేదు. కందుకూరు నాయకులు బుర్ర మధుసూధన్ యాదవ్ నోరు మెదపడం లేదు. పరిశ్రమలు, భూసేకరణలో జరుగుతోన్న అక్రమాలు గురించి ఒక్క మాట నోట రావడం లేదు. ఇప్పుడు మళ్లీ ప్రభుత్వం భారీగా భూసేకరణ చేస్తుంది. ఈ విషయంలోనూ జనం బాధలు చెప్పుకోడానికి వైసిపి నాయకులు ఆచూకీ కనిపించడం లేదు. రైతులు పండిండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు. విద్యుత్ చార్జీలు మోత, పరిశ్రమల పేరుతో భూ ములు తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కావడం లేదు. జిల్లాలో ప్రజా సమస్యలపై వామపక్షాలు మాత్రమే తమ గళం వినిపిస్తున్నాయి. వైసిపి నేతలు మొద్దు నిద్రలో ఉన్నారనే విమర్శలు మూట కట్టుకుంటున్నారు.


ఆదాల ప్రభాకర్‌రెడ్డి


పి అనిల్‌కుమార్ యాదవ్


బుర్రా మధుసూదన్ యాదవ్


మేకపాటి రాజారెడ్డి


మేకపాటి విక్రమ్‌రెడ్డి


ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అధికారపార్టీ అంటే హడల్..!

అధికార టిడిపి అంటే వైసిపి నేతలు కొందరు హడలి పోతున్నారు. గత ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన కొందరు నేతలు తాము ఎక్కడ ఇబ్బందులు పడుతామోననే భయం వెంటాడుతున్నట్లు కనిపిస్తోంది. ఇసుక, గ్రావెల్, అక్రమ లేవుట్లు, మైనింగ్‌లో జరిగిన అవినీతిలో అప్పట్లో వైసిపి నేతల ప్రాతపై అనేక విమర్శలు వచ్చాయి. ఇప్పుడు టిడిపి నేతలకు వ్యతిరేకంగా మాట్లాడితే ఎక్కడ దెబ్బతింటామోనని ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఐదేళ్లు జనంకు కనిపించకపోయినా ఎన్నికల సమయంలో వచ్చిన హామీలిచ్చి, డబ్బులు ఖర్చుచేస్తే సరి పోతొందని మరి కొందరు నేతలు భావిస్తున్నట్లు సమాచారం. జనం కష్టాలు, సుఖాల్లో అండగా ఉండేవారే నాయకులు, అది అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా ప్రజలు, వారి కష్టాలను వైసిపి నేతలు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

శైవ క్షేత్రాలు కిటకిట..

ప్రజాశక్తి-నెల్లూరు : మహాశివరాత్రి పర్వదినం జిల్లాలోని శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. స్థానిక ములాపేటలోని శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దర్శిం చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, శాంతి, సౌభాగ్యాల కోసం ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలో ఉన్నటువంటి దాదాపు 30 శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి ఆలయంలో కూడా సామాన్య భక్తులకి పెద్దపీట వేసి వారందరికీ కూడా పరమ శివుని దర్శనం ఆశీస్సులు కలిగే విధంగా అధికారులు, పాల కవర్గాలు దర్శన ఏర్పాట్లు చేశాయన్నారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, కోటప్పకొండ క్షేత్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించి ప్రభుత్వ లాంఛనాలతో వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


మూలస్థానేశ్వర ఆలయంలో మంత్రి ఆనం

విసిల వ్యవస్థ అస్తవ్యస్తం

ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు : రాజ్యాంగబద్ధమైన వైస్ ఛాన్సర్ల వ్యవస్థలో కూటమి ప్రభుత్వం వేలు పెట్టి ఉన్నత విద్యా మండలి విలువలను బజార్లో పెట్టిందని వైసిపి ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం వైస్ ఛాన్స్ లర్ల రాజీనామాలపై కూటమి ప్రభుత్వ కుట్రలను ఆధారాలతో సహా నగరంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన బహిర్గతం చేశారు. ఆయన మాట్లాడుతూ శాసనమండలిలో విద్యారంగ సమస్యలపై.. ప్రస్తావించగా కూటమి ప్రభుత్వ సభ్యులు మూకుమ్మడిగా తమపై దాడి చేసే ప్రయత్నం చేశారన్నారు. . తమపై ఎలాంటి దాడులు చేసిన ప్రజా సమస్యలపై గళమెత్తడంలో వైసిపి ఎప్పటికీ వెనకడుగు వేయదన్నారు. తాను ఒక టీచర్ ఎమ్మెల్సీగా, బాధ్యతాయుతమైన నాయకుడిగా విద్యారంగా, ఉపాధ్యాయ సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించడంలో ఎక్కడ వెనక్కు తగ్గేది లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే 17 మంది వైస్ ఛాన్స్ లర్ల ను బెదిరించి ఒత్తిడి చేసి వారి చేత రాజీనామాలు చేయించారన్నారు. ఈ విషయంపై శాసనమండలిలో తాను మంత్రి నారా లోకేష్ ను ప్రశ్నించినప్పుడు.. తనపై టిడిపి సభ్యులు దాడి చేసే ప్రయత్నం చేశారన్నారు. శాసనమండలిలో తనపై కూటమి సభ్యులు వ్యవహరించిన తీరుపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని కోరతామని ఆయన తెలిపారు.


మాట్లాడుతున్న పి చంద్రశేఖర్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పాఠశాల యాజమాన్యం

'ఆక్స్‌ఫర్డ్'లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని పామూరు రోడ్డులో ఉనన బిఆర్ ఆక్స్‌ఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్లో బుధవారం పదో తరగతి విద్యార్థుల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బి.ఆర్ ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ పట్టుదలతో చదవాలని, నిర్ణీత లక్ష్యాలను ఏర్పరచుకొని లక్ష్యసాధనకు కషి చేయాలన్నారు. రాబోయే పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలన్నారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి.బాల భాస్కరరావు, బి. నరేంద్రబాబు, పాఠశాల డీన్ ఎం. రామారావు, ప్రిన్సిపాల్స్ పి మల్లికార్జున, ఎస్‌కెనజీర్,సునీత కనిగిరి కాలేజ్ డైరెక్టర్ పి.రాంబాబు ,స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ ఉన్నారు.

'గురుకులం'లో వెట్టిచాకిరీపై

బాలల హక్కుల కమిషన్ స్పందన


నెల్లూరు : గండిపాళెం 'గురుకుల పాఠశాల విద్యార్థులతో వెట్టిచాకిరి' అన్న పేరుతో సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై ఎట్టికేలకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ స్పందించింది. ఈ కథనాలపై పాఠశాల ప్రన్సిపాల్ పుష్పరాజ్ వివర ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని గండిపాలెం గురుకుల పాఠశాలలో విద్యార్థులతో పనులు చేస్తున్నారంటూ కొన్ని పత్రికల్లో వార్తా కథనాలు, సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడమే కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమకు ఫిర్యాదు చేశారని ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని కలెక్టర్‌ను కోరినట్లు వారు తెలిపారు. పిల్లలతో పనులు చేయిస్తూ వేదింపులకు గురిచేస్తున్నట్లు తెలిస్తే పక్కాగా సమాచారం అందజేయా లన్నారు. నివేదిక అందిన వెంటనే ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై, విద్యా ర్థులతో పనులు చేయించిన వారిపై చర్యలు తీసుకుంటామని బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ అప్పారావు, కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి ఆ ప్రకటనలో తెలిపారు.

గ్రామాల్లో అంధకారం..

వెలగని వీధి దీపాలు -పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి - వలేటివారిపాలెం

మండలంలోని పోలినేనిపాలెం, అయ్యవారిపల్లె, పోకూరు పోలినేని చెరువు, శాఖవరం, కలవళ్ల, కొండసముద్రం తదితర గ్రామాలలో వీధిలైట్లు వెలగక ప్రజలు అంధకారంలో జీవనం గడుపుతున్నారు. గ్రామాలలో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి ఉంది. సిమెంట్ రోడ్ల పక్క సైడు కాల్వుల్లో మురుగు పేరుకుపోయి వాటి పూర్వస్థితిని కోల్పోయి ఉన్నాయి. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరుపై మండల స్థాయి అధికారులు తమ కెందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపి స్తున్నాయి. మండలంలోని కొండసముద్రం గ్రామపంచాయతీ పరిధిలో దాదాపు 90 వరకూ వీధిలైట్లు ఉండగా వాటిలో పనిచేయని వీధిలైట్లపై పంచాయతీ అధికారుల పర్యవేక్షణ ఉండడం లేదు. ప్రధానంగా కొండసముద్రం గ్రామంలోని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, దక్షిణం బజారు, కొత్తూరు తదితర ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగక రాత్రి సమయాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాలలో వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండడంతో సాయంత్రం పనులు ముగించుకొని ఇళ్లకు వచ్చే ప్రజలు దారిలో వీధిలైట్లు వెలగకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గ్రామంలో కాలనీల నుండి పాల కేంద్రం వద్ద పాల కోసం, వ్యవసాయ పనుల సమాచారం కూలీలకు చెప్పేందు కోసం ప్రజలు సాయంత్రం సమయాలలో వెళుతుంటారు. ఈ నేపథ్యంలో వీధుల చివర్లలో లైట్లు వెలగక విష పురుగుల సంచారం అధికంగా ఉంటోంది. చీకటిగా ఉండటంతో విషపురుగులు గహాలలోకి వస్తు న్నాయి. ఇటీవల గ్రామంలోని దక్షిణం బజారు చివర ఒక గహంలోకి పాము రావడంతో వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఇంతలో ఇరుగు, పొరుగు వారు వచ్చి పామును చంపడంతో ఊపిరి పీల్చుకున్నారు. గ్రామంలో గత మూడు నెలలుగా వీధిలైట్లు వెలగక ఇబ్బందులు పడ్డ ప్రజలు సహించలేక గత నెల రోజులుగా కొండసముద్రం గ్రామపంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినప్పటికీ ఆమె సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్ పై చెబుతున్నారు. సదరు సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్ ఎప్పుడూ సచివాలయంలో అందుబాటులో ఉండరు. ఫోన్ చేసిన ప్రజలకు లైట్ లు స్టాక్ లేవని తప్పించుకుంటున్నట్లు ప్రజలు చెబుతున్నారు. పంచాయతీ ఉన్నతాధికారులు స్పందించి ప్రజలు విషపురుగుల కాటుకు బలి కాకముందే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపిడిఓ కె నరేంద్ర దేవ్ ను గురువారం ప్రజాశక్తి వివరణ కోరగా ఇఒపిఆర్‌డితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కొండసముద్రంలో వీధిలైటు వెలగక టార్చిలైట్ వేసుకుని వెళ్తున్న గ్రామస్తులు

పేదలకు భోజనాలు

ప్రజాశక్తి-కందుకూరు : శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు , కొంత మంది దాతల సహకారంతో కందుకూరు పట్టణ వీధుల్లో తిరుగుతూ ఉండే పేదలకు, నిరాశ్రయులకు మధ్యాహ్నం ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశారు. పాపా నాయుడు పేటలోని లక్ష్మీ నరసింహ అనాథ వద్ధాశ్రమంలో మధ్యాహ్న భోజనం మధిర ఆదరణ అనాథ వద్ధాశ్రమంలో ఉన్న వ్రద్ధులకు రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. జరుగుమల్లి మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట కిషోర్ మాట్లాడుతూ ఇలాంటి పర్వ దినాలలో పేదలకు, అనాథలకు మంచి భోజనాన్ని అందించటం మంచి కార్యక్రమం అన్నారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, సెక్రెటరీ పబ్బిశెట్టి వెంకట సురేష్,బాలసా హరిబాబు, గుర్రం చిన్న అల్లూరయ్య, పి.వెంకట గౌతమ్ శివతేజ, అప్పల వెంకట రత్తయ్య దంపతులు పాల్గొన్నారు.

మార్చి 10,19 తేదీల్లో

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు : పొగాకు వేలం కేంద్రాలు తెరిచి రైతుల నుంచి పొగాకు కొనుగోళ్ల చేసేందుకు దాదాపు ముహూర్తం ఖరారైయింది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని పొగాకు వేలం కేంద్రాలను మార్చి 10, 19 తేదీలలో ప్రారంభించనున్నారు. మంగళవారం గుంటూరులోని పొగాకుబోర్డు కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కందుకూరు 1, కొండపి, పొదిలి, ఒంగోలు 1 వేలం కేంద్రాలు మార్చి 10న ప్రారంభించనున్నారు. కందుకూరు 2, డీసీ పల్లి, కలిగిరి, కనిగిరి, టంగుటూరు, ఒంగోలు 2, వెల్లంపల్లి వేలం కేంద్రాలు మార్చి 19న ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. గుంటూరులోని కేంద్రకార్యాలయంలో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన కందుకూరు ప్రాంత రైతులు మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు సాగు ఖర్చు గణనీయంగా పెరిగింది. గత ఏడాది కన్నా కనీసం 20 శాతం అదనంగా సరాసరి ధర దక్కేలా వేలం ప్రక్రియను నడిపించాలని కోరారు. వాతావరణ ఆధారిత వ్యవసాయ బీమా , ప్రధానమంత్రి ఫసల్ యోజనలో పొగాకు పంటకు కూడా స్థానం కల్పించేలా బోర్డు చర్యలు తీసుకోవాలని కోరారు. గిటుబాటు ధర కల్పిచక పోతే రైతులు నష్టపోతారని సమావేశంలో రైతులు తెలిపారు.



నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : మహాశివరాత్రి సందర్భంగా వాసవి క్లబ్ లెజెండ్స్, వనిత క్లబ్ కందుకూరు వారి ఆధ్వర్యంలో బుధవారం శివాలయము వద్ద యాచకులకు మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్ల పంపిణీ జరిగింది. తదుపరి భర్త లేని నిరుపేద దివ్యాంగురాలైన మహిళకు నిత్యావసర సరుకులకు ఆర్థిక సహాయం, దుప్పట్లు అందజేశారు. కోట వెంకటేశ్వర్లు, కొత్తూరి నటరాజ్ కుమారి , వాసవి లెజెండ్స్ క్లబ్ ప్రెసిడెంట్ చీదెళ్ళ కష్ణ, సెక్రెటరీ గాదంశెట్టి మణికుమార్, ట్రెజరర్ కొండేటి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం


బుర్రాను సత్కరిస్తున్న దృశ్యం

'బుర్రా'కు సన్మానం

ప్రజాశక్తి - లింగసముద్రం

లింగసముద్రంలోని కోటయ్య స్వామిని,మొగిలిచర్ల లోని దత్తాత్రేయ స్వామిని కందుకూరు వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ దర్శించుకున్నారు. బుధవారం ఆయన తొలుత లింగసముద్రం వచ్చారు. అక్కడ జరుగుతున్న యాదవ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు.కొద్ది సమయం భక్తులకు భోజనం పెట్టారు. మండల పరిషత్ అధ్యక్షులు పెన్నా కష్ణయ్య వైసిపి మండల కన్వీనర్ నోటి వెంకటేశ్వర్ రెడ్డి లతో కలిసి రెండు చోట్ల పర్యటించారు. అదేవిధంగా మొగిలిచర్ల దత్తాత్రేయ స్వామి దేవాలయం వద్దకు వెళుతూ ఆర్ఆర్ పాలెం పంచాయతీ పరిధిలోని గొల్లపాలెం లో ఉన్న నాగదేవత పుట్టను దర్శిం చుకున్నారు. మొగిలిచర్ల లో మధుసూదన్ ను ధర్మకర్త నాగేంద్రప్రసాద్ సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈయన వెంట యర్రారెడ్డిపాలెం సర్పంచ్ డబ్బుగొట్టు మల్లికార్జున,వైసీపీ నాయకులు ఎందోటి మాల్యాద్రి,వైయస్సార్ టియుసి అధ్యక్షులు మట్టే వేణుగోపాల్,వైసిపి నాయకులు చీమల శ్రీనివాస్ యాదవ్, కొలికి కొండలరావు,మట్టే మాల్యాద్రి, మట్టే నరసింహం,బోడి ప్రసాద్ ఉన్నారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలో మహాశివ రాత్రిని పురస్కరిం చుకొని గంగా పార్వతీ సమేత స్కందపురి సోమేశ్వర స్వామి ఆలయంలో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు , వేద పండితులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనానంతరం భక్తుల కోసం ఏర్పాటుచేసి తీర్థప్రసాదాలు ఎమ్మెల్యే స్వయంగా భక్తులకు అందజేశారు. ఆలయ ఈవో రవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, చిలకపాటి మధుబాబు, వడ్డెళ్ళ రవిచంద్ర, కొత్తూరి వెంకట సుధాకర్, మురారిశెట్టి సుధీర్, ముచ్చు వేణు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో. కందుకూరు పెద్ద బజారులో ఉన్న శ్రీ కోదండ రామాలయంలో అర్చక స్వామి శ్రీ రామచంద్రాచార్యులు తాత్కాలిక శివలింగాన్ని ఏర్పాటు చేసి శివలింగానికి పాలాభిషేకం, పంచామతాభిషేకం, బస్మాభిషేకం నిర్వహిం చారు. ఆలయానికి వచ్చిన భక్తులచే స్వయంగా పాలాభి షేకం చేయించారు. ఆలయ ప్రెసిడెంట్ మురారి శెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారి శెట్టి శ్రీనివాసులు, నగర ఆర్యవైశ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: మండలంలోని వలేటివారి పాలెం పంచాయతీలో మహాశివరాత్రి పండగ పురస్కరించుకొని ప్రసిద్ధ శైవ క్షేత్రమైన శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ముందుగా ఆలయ నిర్వాహకులు, వేద పండితులు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే కి స్వాగతం పలికారు. ఆలయ ఈవో కార్తీక్ మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, దామా మల్లేశ్వరరావు కాకుమాని హర్ష, కాకుమాని ఆంజనేయులు, వలేటి నరసింహం, గుత్తా మహేశ్వరరావు, వలేటి శ్రీధర్ నాయుడు, మన్నం మాధవరావు, గుత్తా కొండయ్య పి శ్రీనివాసులు ఉన్నారు.


వలేటివారిపాలెంలో..



కోటయ్య స్వామిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

లింగసముద్రం,మొగిలిచర్లకు తరలివచ్చిన భక్తులు

ప్రజాశక్తి - లింగసముద్రం : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండల కేంద్రమైన లింగస ముద్రంలోని తిరుమనిశెట్టి కోటయ్య స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.బుధవారం తెల్లవారుజాము నుండి స్వామి వారి దర్శనానికి బారులు తీరారు.అదేవిధంగా మొగిలిచర్ల దత్తాత్రేయ స్వామి ని దర్శించుకునేందుకు భక్తులు వచ్చారు. ఇక్కడ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్ర ప్రసాద్ ఏర్పాట్లు చేశారు. ప్రకాశం,నెల్లూరు జిల్లాల నుండి భక్తులు భారీగా రావడం జరిగింది. లింగసముద్రం లోని కోటయ్య స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెరగడంతో క్యూ లైన్ వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు వెళ్ళింది స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో ఉండి భక్తులు వేచి ఉన్నారు. రెండు చోట్ల మొక్కులు చెల్లించుకున్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు కావలి,కందుకూరు డిపోల నుండి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ప్రతిష్ట బందోబస్తును నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు లేకపోవడం భక్తులు వెంటనే తిరిగి వెళ్లిపోయారు.


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

భారీగా అన్నదానాలు

లింగసముద్రంలో తిరునాళ్లకు వచ్చే భక్తులకు పలుచోట్ల అన్నదానం కార్య్ర కమాలను ఏర్పాటు చేశారు. కష్ణమోహన్ హాస్పిటల్ సమీపాన యాదవ సంఘం ఆధ్వర్యంలో భారీగా అన్నదాన కార్యక్రమంలో ఏర్పాటు చేశారు.ఆర్యవైశ్య సంఘం నాయకులు మలిశెట్టి శ్రీనివాసులు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో భోజనాలు ఏర్పాటు చేశారు.అదేవిధంగా అయ్యప్ప స్వామి దేవాలయంలో కూడా భక్తులకు అన్నదానం పెట్టారు. తాత హెూటల్ సెంటర్లో కమ్మ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తులకు ఏర్పాటు చేయడం జరిగింది.మొగిలిచర్ల దేవాలయం దగ్గర దేవస్థానం ఆధ్వర్యంలో పలువురు అన్నదానం ఏర్పాటు చేశారు.

పులిహార పంపిణీ చేసిన పూర్వ విద్యార్థులు

లింగసముద్రంలోని కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు శివరాత్రి తిరునాళ్లకు వచ్చే భక్తులకు పులిహార పంపిణీ చేశారు. బుధవారం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తులకు పులిహారాన్ని అందజేశారు. వరుసగా ఏడో సంవత్సరం పూర్వ విద్యార్థులు భక్తులకు పులిహెూర పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు ప్రారంభించారు. విరామం లేకుండా ప్రతి సంవత్సరం తిరునాళ్లకు వచ్చే భక్తులకు పులిహెూర ఏర్పాటు చేయడం అభినందనీయమని పూర్వ విద్యార్థులను ఆయన అభినందించారు పూర్వ విద్యార్థులు చప్పిడి కొండలరావు,బింకం నరేంద్ర, సంగా సురేష్,తోపూరి రమేష్,కన్నెపల్లి సురేష్,మట్లే ఏడుకొండలు, బాలకృష్ణ, చాగం భాస్కర్ ఉన్నారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



ప్రజాశక్తి-కావలి

ఎంఎల్ఎ కార్యాలయంలో బుధవారం రూ.10 లక్షల ఎంఎల్ఎ దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సిఎంఆర్ఎఫ్ చెక్కును ఎల్.ఒ.సి.ని లబ్ధిదారునికి అందజేశారు. ఇటీవల అనారోగ్య పాలైన సైదాపేట ముని మోక్షిత అతి చిన్న వయసులో తలసేమియా మేజర్‌తో బాధపడుతూ ఇటీవలే చెన్నైలోని హాస్పిటల్‌లో అడ్మిట్ అయింది. శస్త్రచికిత్స అవసరమని అక్కడి వైద్యులు సూచించారు. ఇందుకు రూ.25 లక్షలు ఖర్చవుతుందని తెలియజేశారు. వీరు పేద కుటుంబానికి చెందిన వారు కావడంతో అంత మొత్తం చెల్లించి వైద్యం చేయించుకునే స్తోమత వీరికి లేక స్థానిక ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డిని ఆశ్రయించడంతో ఎంఎల్ఎ తక్షణమే స్పందించి సిఎం సహాయ నిధికి అప్లై చేయించి వెనువెంటనే ఎల్.ఒ.సి.ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయించారు. అంతేకాకుండా కుటుంబ సభ్యులతో మాట్లాడి పాప యోగక్షేమాలను తెలుసుకొని, వైద్యులతో మాట్లాడి ఆపరేషన్ విజయవంతం చేయాలని వైద్యులను కోరారు.

వడ్డిపాలెంలో పూరిల్లు దగ్ధం



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని వడ్డిపాలెం కనకదుర్గ ఆలయం వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి, గ్యాస్ సిలిండర్ పేలడంతో పూరిల్లు దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి మధ్యాహ్నం ఆ ఇంటి కుటుంబ సభ్యులైన గుంజి వెంకటేశ్వర్లు, గుంజి కోటేశ్వరి దంపతులు శివాలయానికి వెళ్లి వచ్చేలోగా ఈ దారుణం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రూ.1,50,000 నగదు, 15 సవర్ల బంగారం దగ్ధమయ్యాయని గుంజి కోటేశ్వరీ చుట్టుపక్కల వారు తెలిపారు. సమాచారం తెలియగానే ఆ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపిస్తున్నారు. అయితే అక్కడ స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం తెలిపిన ఫైర్ ఇంజన్ రిపేరు అయ్యిందంటూ ఉట్టిచేతులతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేవారికి సూచనలు ఇచ్చి వివరాలను రాసుకొని వెళ్లారు.

మజ్జిగ పంపిణీ



ప్రజాశక్తి-కావలి : పాతూరు రుద్రపాద మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం "జంగమదేవర్ల సేవాసమితి" ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బిసి ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్ (శివ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ స్థాయిలో దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది.

ఈతకెళ్లి బాలుడు మృతి



యశ్వంత్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-సంగం : మండలంలోని కోలగట్ల వద్ద ఈత సరదా ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ఆత్మకూరుకు చెందిన ఏడుగురు స్నేహితులు ఈత కొట్టేందుకు పెన్నానదికి వెళ్లారు. అందరూ సరదాగా గడుతుండగా యశ్వంత్ (15) అనే బాలుడుకి ఈత రాకపోవడంతో నీటిలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానికులు నీటిలో గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడు యశ్వంత్ పదవ తరగతి చదువుతున్నాడు. అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ బిడ్డ మృతి వార్త తెలియడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



మట్టి మాఫియా ఆగడాలు..

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని ముదివర్తి గ్రామంలో పెన్నానది పరివాహక ప్రాంతాలలోని మట్టి మాఫియా ఆగడాలు ఎక్కువయ్యాయని గ్రామస్తులు వాపోయారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇటుకుల బట్టీలకు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ రోడ్లపై విద్యార్థులు, వాహనదారులు ప్రమాదాలకు గురయ్యేలా చేస్తున్నారన్నారు. ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎన్నిసార్లు చెప్పినా మట్టి మాఫియా ఆగడాలకు అడ్డు లేకుండా ఇటుకుల బట్టీలకు తరలిస్తూ జోబీలు నింపుకుంటున్నారని విమర్శిస్తున్నారు. అధికారులు మాత్రం చోద్యం చూస్తూ ఉండడంతో మండలంలో ప్రజలకు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారంటున్నారు. మట్టి మాఫియాకు అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా పగలు రాత్రి తేడా లేకుండా ఇటుకల బట్టీలకు తరలిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ట్రాక్టర్లు చూసి ముదివర్తి గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తహశీల్దార్ చంద్రశేఖర్, ఎస్ఐ నరేష్ యాదవ్ సంఘటన స్థలానికి చేరుకొని ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేశారని పోలీసులు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి మట్టిమాఫియా ఆగడాలను అరికట్టాలని గ్రామస్తులు కోరారు.



ప్రమాదభరింతగా ఉన్న మలుపు ప్రాంతం


ప్రమాదభరితంగా మలుపులు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండల కేంద్రమైన వరికుంటపాడు నుండి తూర్పు బోయమడుగుల, గువ్వాడి, కాంచెరువు, ఇసుకపల్లి, గండిపాలెం గ్రామాలకు వెళ్లే రోడ్డు మలుపులు ఉన్నందువల్ల ప్రమాదభరితంగా మారింది. దానికి తోడు తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఇటీవల రెండు ప్రమాదాలు జరిగాయని ప్రయాణికులు తెలిపారు. అందులో రోడ్డు రవాణాశాఖ వారు కనీసం పిచ్చి మొలక చెట్లయినా కూడా పెరగడం లేదని కంపచెట్లు వివిధ మొక్కల చెట్లు పెరిగి మలుపును గుర్తించే విధంగా లేవని వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత రవాణా శాఖ అధికారులు పట్టించుకోని మలుపుల వద్ద పిచ్చి మొక్కలను పీకించి మలుపు చిహ్నాలను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహన శోధకులు కోరుతున్నారు.

పెచ్చులూడుతున్న ఎంపిడిఒ కార్యాలయం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట



పెచ్చులూడుతున్న ఎంపిడిఒ కార్యాలయం

స్థానిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలోని భవనం స్లాబు పెచ్చులూడి, కింద పడుతున్న సందర్భాలు అనేకం జరుగుతున్నాయని, మండల కార్యాలయంలో పనుల నిమిత్తం అన్ని గ్రామాలలోని ప్రజలు నిరంతరం వస్తూ ఉంటారని, కావున ఈ విషయాన్ని అధికారులు గుర్తు ఎరిగి ఆ స్లాబ్‌కు మరమ్మతులు చేయించాలని, మండల ప్రజలు కోరుకుంటున్నారు. అదేవిధంగా మండల ప్రాదేశిక అధ్యక్షురాలు రూములోని ఫ్యాన్లు ఇటీవల తిరగడం లేదని, ఎంపిపి బోయిళ్ళ పద్మజా రెడ్డి ఇటీవల పత్రికాముఖంగా తెలియజేసి ఉన్నారని ప్రజా ప్రతినిధులపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించకుండా అధికారులు సరైన సమయంలో మండల ఆఫీసులలోని మరమ్మతులకు గురైన వాటిని త్వరగతిన బాగు చేయాలని కోరుకుంటున్నారు. అదేవిధంగా మండలంలోని ఎలాంటి సమాచారాన్నైనా సమాచార హక్కు చట్టం ద్వారా మాత్రమే సమాచారాన్ని ప్రయివేటు వ్యక్తులకు జార వేయాలని, అలా కాకుండా అడిగిన వెంటనే ప్రయివేటు వ్యక్తులకు సమాచారాన్ని అందించడం ఫొటోలు తీసుకోనివ్వడం లాంటివి మండల అధికారులు చేస్తున్నారని ఆమె పత్రికాముఖంగా వాపోయారు.

ఆగిన సోమశిల హైలెవల్ కెనాల్ పనులు

- పడమటినాయుడుపల్లి రిజర్వాయర్ పనుల ఊసేలేదు
- పరిహారం కోసం బాధితుల ఎదురు చూపులు



ప్రజాశక్తి-మర్రిపాడు

మెట్టప్రాంత మండలాలకు తాగు, సాగు నీరందించేందుకు అప్పటి ప్రభుత్వాలు ఆనం సంజీవరెడ్డి సోమశిల హైలెవల్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేశారు. కానీ కొన్ని మండలాలకు సోమశిల జలాశయం ప్రాజెక్ట్ వర ప్రసాదినిగా మారింది. నిర్దిష్ట గడువుకు పనులు పూర్తయి ఉంటే మెట్ట ప్రాంతవాసులకు తాగు, సాగునీటి ఎద్దడి తీరి సుభిక్షంగా ఉండేది. అయితే శిలాఫలకం వేసి సంవత్సరాలు గడిచినా.. ఇప్పటికీ 60శాతం పనులు పూర్తికాలేదు. మొదటి విడతలో పూర్తి కావాల్సిన రిజర్వాయర్ పనులు నిలిచిపోగా, రెండోఫేజ్‌లో రిజర్వాయర్ పనులు జరుగుతుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ల నిర్మాణంలో భాగంగా మొదట పడమటి నాయుడు పల్లిరిజర్వాయర్ పనులు మొదలు కాక నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరిగిందని గ్రామస్తులు వాపోతున్నారు. భూసేకరణ సమస్య ప్రధాన అడ్డంకిగా మారిందని పనులు నిలుపుదల చేశామని చెప్పిన అధికారులు గ్రామంలోని 40ఎకరాల్లో భూసేకరణ క్లియరెన్స్ పూర్తి అయిందని పరిహారం తరువాయి అని రెవెన్యూ అధికారులు గ్రామస్తులు నిర్వాసితులకు తెలిపారు. సంవత్సరాలు గడుస్తున్నా మొదటి రిజర్వాయర్ నిర్మాణం ఊసే లేకపోగా నేటికీ పరిహారం అందలేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీలోని కుంపవెల్లిపాడు, కొత్తూరు బిసి కాలనీ, అనంతపురం ముంపు గ్రామాలుగా ప్రకటించిన అధికారులు నిర్వాసిత గ్రామం ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు. వారి భూములను స్వాధీనం చేసుకుని ఉపాధి అంశాన్ని వదిలేశారు. రీసెటిల్‌మెంట్ అండ్ రీహాబిలిటేషన్ (ఆర్అండ్ఆర్) ప్యాకేజీని అమలు చేయలేదు. కేవలం భూములకు సంబంధించిన పరిహారాన్నే మరిచారు. నిర్వాసిత గ్రామ నిర్మాణం గురించి కానీ, వారి ఇళ్లు, చెట్లు, పశు సంపదకు నష్టపరిహారం పంపిణీ జరగలేదు. పదేళ్ల క్రితం రిజర్వాయర్ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేటికి పట్టించుకోలేదు. ప్రభుత్వం ద్వారా గ్రామానికి వచ్చే అభివృద్ధి పనులకు ఏకరువు పెట్టి అధికారులు చోద్యం చూస్తు న్నారని గ్రామస్తులు మండి పడుతున్నారు. ప్రస్తుతం వసతుల లేమితో సతమతమవుతున్నారు.

ప్రధానంగా ముంపు గ్రామాల్లో ఇప్పటికీ నివసిస్తున్న వారి గృహాలు, పశువుల శాలలకు, ఫలసాయం ఇస్తున్న చెట్లకు పరిహారం చెల్లించలేదు. దానిపై గతంలో నీటి పారుదల శాఖ అధికారులు సర్వే చేసినప్పటికీ గ్రామస్తులు సంతృప్తి చెందలేదు. సర్వేకూడా సక్రమంగా జరగలేదని పెదవి విరుస్తున్నారు. దానిపై అధికారులు ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గ్రామాన్ని వదిలి నిర్వాసిత గ్రామానికి తరలి పోయేందుకు కొత్త గ్రామ నిర్మాణం, స్థలం కేటాయింపు, ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. నియోజకవర్గ ఎంఎల్ఎ, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ విషయంపై దృష్టి సారించి పడమటి నాయుడు పల్లి గ్రామస్తులకు న్యాయం జరిగేలా చూడాలని, నిర్వాసితులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు

- ప్రదర్శనకు విశేష స్పందన



బహుమతి అందజేస్తున్న పోలీసుల అధికారులు

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని రేగుంటపాడు గ్రామంలోని మిత్ర సీడ్స్ గోదాము సమీపంలో బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గుణపాటి తులసి రామ్‌రెడ్డి మెమోరియల్ రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు ప్రదర్శనను రైతు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 40 జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. ఈ పోటీలను ట్రైని డిఎస్‌పి శివప్రియ, ఎస్ఐ రంగనాథ్ గౌడ్ వచ్చి జాకిర్లను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉత్సాహంగా ప్రకాశం, చీరాల, బాపట్ల, జిల్లా తదితర ప్రాంతాల నుంచి కూడా రైతులు ఉత్సాహంగా రావడం జరుగుతుందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహిస్తున్న రైతు సమన్వయ సంఘాన్ని వారు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు ప్రదర్శనలో మొదటి బహుమతి వెంకటకృష్ణ చౌదరి సహకారంతో ఎస్ఎస్ బ్రదర్స్ ఎడ్లు జట్టు విజేతకు రూ.50వేలు, నగదు కప్పు అందజేశారు. రెండో బహుమతి గుణపాటి భూపేష్ రెడ్డి సంకారంతో తూర్పు గోదావరి జిల్లాకు రతేజ చౌదరి గుమ్మలేరు ఎడ్ల జట్టు కైవసం చేసుకుంది. విజేతకు రూ.40వేలు, భారీ కప్పును అందజేశారు. మూడో బహుమతి షేక్.జాఫర్ సాగారంతో కోవూరు చెందిన చెన్నకేశవస్వామి ఎడ్ల జట్టు రూ.30వేలు భారీ కప్పులు కైవసం చేస్తుంది. నాలుగో బహుమతిని పొట్టేపాలెం కు చెందిన వరసిద్ధి వినాయక స్వామి ఎడ్ల జట్టు కైవసం చేసుకుంది. కౌసల్య డైరీ ఫార్మ్ అధినేతలు రూ.20వేలు కప్పును అందజేశారు. ఐదవ బహుమతి బట్టేపాడు వేణురెడ్డి జ్ఞాపకార్థం వీరారెడ్డి రూ.10వేలు సుజాత అల్లూరికి చెందిన జరుగుపల్లి సాయిగౌతమ్ ఎడ్ల జట్టు కైవసం చేసుకుంది. ఈ కప్పులను మిత్ర సీడ్స్ అధినేత గుణపార్థీ మిత్ర రెడ్డి సహకారంతో విజేతలకు అందజేశారు. ప్రశాంతంగా ఎటువంటి అవాంఛన సంఘటన లో జరగకుండా ఈ పోటీలను నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రైతు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలియజేశారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అల్లూరు

అల్లూరులోని దేవిరెడ్డి శారదా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి కావలి ఎంఎల్ఎ దగ్గుబాటి వెంకటకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కట్ చేసి జ్యోతి ప్రజ్వలనతో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దివంగత దేవిరెడ్డి శారదమ్మ విగ్రహానికి వెంకటకృష్ణారెడ్డి మాజీ ఎంఎల్ఎ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డిలో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ దగ్గుబాటి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ తన ఇంటిని గృహిణి ఎంత చక్కగా పెట్టుకుంటుందో మగవారు అంతగా రాణిస్తారన్నారు. చనిపోయిన భార్య పేరున ఇంత పెద్ద ట్రస్ట్ నెలకొల్పి అనేక రకాల సేవా కార్యక్రమాలు చేపడుతున్న దేవిరెడ్డి సుధాకర్ రెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. సుధాకర్ రెడ్డి మన ప్రాంతంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదికి తన కాంట్రాక్టు వృత్తిని చేపట్టి అందులో నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం ఇచ్చి ఎన్నో సమస్థలు ఏర్పాటు చేసి ఎన్నో వేల మందికి జీవనోపాధ్యాయులు కల్పిస్తున్నారన్నారు. అల్లూరు మండలం పురిణి గ్రామంలో పుట్టిన వ్యక్తి హైదరాబాదులో తలకట్టు ఒక మార్కులు ఏర్పరచుకొని ఎంతోమంది హృదయాలలో తనపేరుని పదిలం చేసుకున్న వ్యక్తి సుధాకర్ అని ఎంఎల్ఎ కొనియాడారు. మెగారక్తదాన శిబిరంలో 75మంది దాతలు రక్తదానం చేశారు. దేవిరెడ్డి దశరథ రామిరెడ్డి, ట్రస్ట్ అడ్మిన్ మేనేజర్ శ్రీ ఇందుపూరు అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ వి.సుజాత, డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆర్. నవీన్, డాక్టర్ కే. సింధుజ, దేవిరెడ్డి శారదా చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ శ్రీ దేవిరెడ్డి దశరథ రామిరెడ్డి, ట్రస్ట్ అడ్మిన్ మేనేజర్ ఇందుపూరు అనిల్ కుమార్ రెడ్డి, డాక్టర్ శ్రీ జెట్టి రమేష్, ప్రిన్సిపాల్ శ్రీలతా చౌదరి, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఇన్‌ఛార్జి బండ్ల రామచంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలను నిషేధించాలి

ప్రజాశక్తి-కావలి

జీవహింసను ప్రేరేపిస్తూ, ఎద్దులతో అత్యంత బరువైన రాతి బండలను లాగించి, నోరులేని జీవాలను ఇబ్బంది పెట్టే లాంటి పోటీలను శివరాత్రి ఉత్సవాల్లో జరుపడాన్ని అధికారులు అడ్డుకోవాలని కావలి ఉమెన్స్ ఫోరం కన్వీనర్ చాకలికొండ శారద ప్రకటనలో కోరారు. ఆమె శివరాత్రి ఉత్సవాల సందర్భంగా మీడియా నుద్దేశించి మాట్లాడారు. భక్తి ప్రపత్తులను ఆధ్యాత్మికతను పెంచి మానవులను సన్మార్గంలో నడిపించాల్సిన వివిధ పండుగలు - జాతరలు, ఉత్సవాల సందర్భంగా గ్రామాల నుండి పట్టణాల దాకాభక్తి - ముక్తి కలిగించే కార్యక్రమాలు చేపట్టడంలో భాగమై పోతూ, భారతీయ సంస్కృతిని కలుషితం చేస్తూ, రాత్రిళ్లు వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ఉత్సవ కమిటీలు అశ్లీల - అసభ్యకర సినీ - ప్రయివేట్ పాటలతో రసాభాసా చేస్తుండటం మామూలైపోయిందన్నారు. యువత మద్యం స్వీకరించి వస్తుంటారన్నారు. ఇటీవల గంజాయి వ్యసనం పెరిగిపోయిందన్నారు. భక్తిని రక్తిగా మార్చుతున్నారన్నారు. ఒళ్లు తెలియకుండా ప్రవర్తిస్తూ ఉత్సవాల ప్రాముఖ్యతను విషసంస్కృతిగా భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. కాబట్టి ఈ రోజు నుండి ప్రారంభమయ్యే శివరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగనీయకుండా పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖాధికారులు అత్యంత జాగ్రత్తగా ఉండి, ఉత్సవ కమిటీలకు ఆంక్షలు విధించాలని కోరుతున్నామన్నారు. శివరాత్రి ఉత్సవాలు పూర్తయేదాకా మద్య నిషేధం విధించాలన్నారు. అశ్లీల నృత్య ప్రదర్శనలు జరపకుండా నిషేధాజ్ఞలు ఇవ్వాలన్నారు. కాబట్టి ముందస్తుగా తగు నిబంధనలు విధించి , నిబంధనలు పాటించని వారిపై తక్షణ క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఉత్సవాలు జరపాలన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ హరిప్రసాద్

కావలి మండలంలో ఫౌండేషనల్ లిటరసి అండ్ న్యూమరసీ - జ్ఞానజ్యోతి -120 డేస్ - అంగన్‌వాడీ టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లోని 6రోజుల మొదటి ఆఫ్‌లైన్ సెషన్ పూర్తి అయిన సందర్భంగా బుధవారం ముగింపు కార్యక్రమాన్ని స్థానిక జెడ్‌పి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి (డిప్యూటీ డి.ఇ.ఒ) హరిప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు బండి గోవిందయ్య, చల్లపల్లి వెంకట సుబ్బయ్య, ఐ.సి.డి.ఎస్. డిపార్ట్మెంట్ సిడిపిఒ కె.సౌజన్య, డిఆర్‌పిలు బి.మధుసూదన్, కె.మధుసూదన్, బి.వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సుహా సిణి, విజయలక్ష్మి, కృపమ్మ, అంగన్‌వాడీ టీచర్స్, పాఠశాలలోని ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు. ఈ 6రోజుల శిక్షణ కార్యక్రమంను సక్సెస్ ఫుల్‌గా నిర్వహించిన డి.ఆర్.పి.లను అతిథులు ప్రత్యేకంగా అభినందిం చారు. తదనంతరం కావలి డివిజన్ డిప్యూటీ డి.ఇ.ఒ. హరిప్రసాద్, జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినుల తరగతులును పరిశీలించి ఉపాధ్యాయు లకు విద్యార్థినులకు, తమ అమూల్యమైనా సలహాలు, సందేశం ఇస్తూ పాఠశాలలోని విద్యార్థినులు మార్చిలో జరగబోయే ఎస్.ఎస్.సి. -2025 పరీక్షలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కష్టపడి చదవాలని, విజయం సాధించి తమ తల్లిదండ్రులుకు పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని అభిలషించారు.



కాకాణిని కలిసిన రామిరెడ్డి

ప్రజాశక్తి-కావలి

నెల్లూరులోని వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసిపి అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని కావలి ఇన్‌ఛార్జ్, మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో కావలి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధిని గురించి చర్చలు జరిపారు. అయనవెంట కావలి వైసిపి నాయకులు అన్నపూర్ణ శ్రీను పాల్గొన్నారు.



వెంకట్రామిరెడ్డికి పరామర్శ

ప్రజాశక్తి-కావలి

కావలి రూరల్ మండలం గౌరవరం వైసిపి నాయకులు కూనం వెంకట్రామిరెడ్డి ఇటీవల ముక్కు సంబంధిత శస్త్రచికిత్స చేయించుకున్నారు. బుధవారం పుల్లారెడ్డి నగర్‌లోని వారి నివాసం నందు విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంగా ఆయనను కావలి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జ్, మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పరామర్శించారు. ఆయనవెంట వైసిపి నాయకులు వేమిరెడ్డి విజయ్‌కుమార్ రెడ్డి, బొగ్గవరపు శ్రీనివాస రావు, పరుసు మాల్యాద్రి, సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పలుచోట్ల మహాశివరాత్రి వేడుకలు



ఆత్మకూరులో..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఆత్మకూరు పట్టణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరాలయం, కాశీనాయన ఆశ్రమంలోని దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో వేకువజామునే విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అర్చకులు మేళ్ల చెరువు శివకుమారశర్మ మహాశివుడికి విశేష ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకాలు, శివసహస్రనామ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శివలింగానికి భక్తులతో సామూహికంగా క్షీరం, పెన్నానది జలాలతో అభిషేకాలు చేయించారు. అన్నపూర్ణాదేవికి కుంకుమార్చన నిర్వహించారు. 11.30 గంటల నుంచి శివపార్వతుల కళ్యాణం శాస్త్రోక్తంగా, కళ్యాణ ఘట్టాలను వివరిస్తూ నిర్వహించారు. కళ్యాణ ఉభయ కర్తలుగా డాక్టర్ దేవిరెడ్డి కార్తికేయరెడ్డి- మైథిలి దంపతులు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి కవిత దంపతులు వ్యవహరించారు. ఆలయ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. కాశీనాయన ఆశ్రమంలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు దుర్గా మల్లేశ్వర, పార్వతిదేవి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులకు షడ్రసోపేతంగా వివిధ పదార్థాలతో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆశ్రమ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. బైపాస్ రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. అన్నదానం చేశారు.




మర్రిపాడులో..

ప్రజాశక్తి-మర్రిపాడు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. నందవరంలో శ్రీ విశాలక్షి సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో భీమవరం సొసైటీ మాజీ చైర్మన్ ఎర్రమళ్ళ చిన్నారెడ్డి ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యులు స్వామి వార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి శివపార్వతుల కళ్యాణం వైభవంగా జరిపించారు. అల్లంపాడులో నూతనంగా ప్రతిష్టించిన 500యేళ్ళ నాటి శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.



బిట్రగుంటలో..

ప్రజాశక్తి-బిట్రగుంట : మండలంలోని నాగులవరం గ్రామంలో వెలసివున్న గంగా పార్వతి సమేత నాగలింగేశ్వర స్వామిని వారిని బుధవారం ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎకు ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు, గ్రామస్తులు, అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బోగోలు మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, మాజీ సోమశిల డైరెక్టర్ కండ్లకుంట మధుబాబు నాయుడు, సీనియర్ నాయకులు కాంట్రా రఘురాం నాయుడు, చిలకపాటి వెంకటేశ్వర్లు, కాంట్రా సతీష్ నాయుడు, ఎల్.సుధీర్ బాబు, నాయకులు పాల్గొన్నారు.



వింజమూరులో

ప్రజాశక్తి-వింజమూరు : మండల పరిధిలోని అన్ని శైవ క్షేత్రాలలో వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి శివాలయాలలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి దర్శన కార్యక్రమం భక్తుల కోసం ప్రారంభించారు. స్వామి దర్శనం కోసం వచ్చిన ప్రతి భక్తునికి తీర్థప్రసాదాలు వినియోగించారు. వింజమూరులోని శివాలయము నందు వింజ పరమేశ్వరీ ఆలయంలో శ్రీ పోతులూరి విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలను ఘనంగా ఎంతో వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారు గ్రామోత్సవానికి బయలుదేరారు. వింజమూరు శివాలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారు నంది వాహనం పైన గ్రామోత్సవానికి బయల్దేరారు. ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ ప్రసాదాల అందజేశారు. ఇంజమరి కొండపై వెలసి ఉన్న శ్రీ వెంకీ పరమేశ్వరీ ఆలయంలో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలలో భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రజాశక్తి దుత్తలూరు : దుత్తలూరు గ్రామ సమీపంలో కొండపై వెలసియున్న శ్రీ రామలింగేశ్వర స్వామిని శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని, కావలి నియోజకవర్గ ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి బుధవారం స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ చైర్మన్ కంభం, సిద్ధారెడ్డి, మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి, ఆలయ అర్చక బృందం పూర్ణాహుతితో ఎంఎల్ఎకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రామలింగేశ్వర స్వామికి ఎంఎల్ఎ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉదయగిరి నియోజక వర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి చల్ల ప్రసాద్ ఎంఎల్ఎను ఘనంగా శాలువాలతో సత్కరించి ఫొటో బహుమానంగా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పెలపూడి వెంకటరత్నం, మాజీ జెడ్పిటిసి సభ్యులు చీదర్ల మల్లి కార్జునా ఆలయ సిబ్బంది ఉన్నారు.



ప్రజాశక్తి-దుత్తలూరు : గ్రామ సమీపంలో కొండపై వెలసియున్న శ్రీ రామలింగేశ్వర స్వామిని శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని, ఉదయగిరి నియోజకవర్గ ఎంఎల్ఎ కాకర్ల సురేష్ బుధవారం స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ చైర్మన్ కంభం సిద్ధారెడ్డి, మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి ఆలయ అర్చక బృందం పూర్ణాహుతితో ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం రామలింగేశ్వర స్వామికి ఎంఎల్ఎ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీరామలింగేశ్వర స్వామి క్యాలండర్లను ఎంఎల్ఎ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి మోటార్, పైపుల కొళాయిలను ఎంఎల్ఎ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పెలపూడి వెంకటరత్నం, మాజీ జెడ్పిటిసి చీదర్ల మల్లికార్జున, వెంగళరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎఎస్‌పేటలో...

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని చిరమణలో వెలసి ఉన్న శ్రీ కామాక్షి దేవి సమేత చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్వామివారికి నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, నరసింహారెడ్డి దంపతులు, కర్నాటి మధుసూదన్ రెడ్డి దంపతులు, నాగిరెడ్డి వెంకటేశ్వర్లు దంపతులు, స్వామి వారి భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, అనంతరం నిర్వహించిన అన్నదాన భక్తులు పాల్గొన్నారు.



కావలిలో..

శివాలయంలో ప్రముఖుల సందడి

ప్రజాశక్తి-కావలి : మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని కావలి పాతూరు శివాలయంలో బుధవారం ప్రముఖులు పాల్గొని సందడి చేశారు. కావలి ఎం.ఎల్.ఎ. దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తన అనుచరులతో కలిసివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంకు విచ్చేసిన ఎంఎల్ఎకు అర్చకులు శశి, ఆలయ ధర్మకర్త కృష్ణమోహన్, ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘన స్వాగతం పలికారు. ఎంఎల్ఎతో పరమేశ్వరునికి ప్రత్యేకంగా పూజలు చేయించి, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం శివాలయం ఆవరణలో "వాసవి సెవెన్ లైన్స్ సేవా సంస్థ" ప్రచురించిన "శివస్తోత్రం" పుస్తకాలను ఎంఎల్ఎ ఆవిష్కరించి భక్తులకు అందజేశారు. ఆయనవెంట రాజ్‌కుమార్ చౌదరి, మధుబాబు నాయుడు, బుర్రా శ్రీధర్ రెడ్డి, తిరివీధి ప్రసాద్, మనోహర్, వాసవి సెవెన్ లయన్స్ సభ్యులు పాదర్తి నాగరాజు, గాదంశెట్టి వేణు, పెట్టుగాని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కావలి పట్టణంలోని పాతవూరు శివాలయాన్ని సందర్శించుకున్నారు. కావలి పట్టణ, నియోజకవర్గ ప్రజలందరూ, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, తులతూగాలని, ప్రజలందరూ భీతి లేకుండా, జీవించాలని, మహాదేవునిని కోరుకున్నారు. ఆయనవెంట వై.సి.పి. నాయకులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, నెల్లూరు వెంకటేశ్వర్లు రెడ్డి, తోట శ్రీహరి, కనమర్లపూడి వెంకటనారాయణ, గుడ్లూరి మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.



విడవలూరులో..

ప్రజాశక్తి-విడవలూరు : మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు నిర్వహించారు. రాత్రికి లింగోద్భవ కాలా అభిషేకం నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇఒ రామకృష్ణ తెలిపారు.

ప్రజాశక్తి-సీతారాంపురం : మండలంలోని పొలంగారిపల్లె సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని దేవరకొండ లోయలో సిద్ధేశ్వర కోన అనే అందమైన ప్రకృతి ఒడిలో స్వయంభుగా వెలసిన శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత ఘటిక సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ శివునికి శివరాత్రిని పురస్కరించుకొని పాలాభిషేకం చేశారు. బుధవారం భక్తుల భక్తిశ్రద్ధల నడుమ, భక్తిశ్రద్ధలతో పురోహితుల మంత్రోచ్ఛరణల నడుమ అభిషేకకార్యక్రమం ఎంఎల్ఎ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌కు కర్పూర హారతులు అందజేశారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రధాన అర్చకులు ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌కు పూర్ణాహుతితో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పు ప్రభాకర్ రాజు, ముత్తంశెట్టి వెంకటేశ్వర్లు, మధురెడ్డి, మాలేపాటి చైతన్య, పద్మావతి దంపతులు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, అన్నదాన సత్రం సేవకులు ఉన్నారు.

ప్రజాశక్తి-సంగంలోని సంగమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తులు వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు. దాంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో మహాశివ రాత్రి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక భజన బృందంతో భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.